రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నెల్లికుదురు: వర్ష బీభత్సానికి నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం, ఇళ్లు కూలిపోయిన బాధితులకు రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రావిరాల గ్రామంలో తెగిపోయిన చెరువు కట్టను మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం వరద బాధిత కుటుంబాలను పరామర్శించారు.

తొర్రూరు రూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు తమ్మెర విశేశ్వర్‌రావు, కొత్తపెల్లి రవి, బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు, కూలిపోయిన ఇళ్లు, ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఓమ భిక్షపతి, యాకుబ్, బందు మహేందర్, గజ్జి యాకయ్య, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, పర్శురాములు, సురేందర్ పాల్గొన్నారు.

ఆకేరు బ్రిడ్జి రోడ్డు పరిశీలన

చిన్నగూడూరు: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆకేరువాగులోకి భారీగా వరద నీరు చేరి చిన్నగూడూరు ఆకేరువాగు బ్రిడ్జి వద్ద రోడ్డు వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. మంగళవారం మహబూబాబాద్ మాజీ ఎంపీ కవిత, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆకేరువాగు బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు.

రైతులను ఆదుకోవాలి

బయ్యారం: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలో వాగుల ప్రవాహం వలన పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సంఘం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మురళీ, రమణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



నెల్లికుదురు: తెగిపోయిన చెరువు కట్టను పరిశీలిస్తున్న శంకర్‌నాయక్, రాకేశ్‌రెడ్డి



బయ్యారం: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: చెరువును పరిశీలిస్తున్న సీపీఐ బృందం



చిన్నగూడూరు: కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎంపీ కవిత

మహబూబాబాద్ రూరల్: అయోధ్య పెద్దబంధం చెరువు బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అయోధ్య పెద్ద బంధం చెరువు కట్ట తెగిపోగా ధ్వంసమైన పంట పొలాలను సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం సందర్శించింది. కార్యక్రమంలో నాయకులు పాండురంగచారి, సందీప్, కుమార్, వెంకన్న, రవి, రవీందర్, మురళీ, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



గార్ల: మద్దివంచ గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు



తొర్రూరు రూరల్: అమ్మాపురంలో మొక్కజొన్న పరిశీలిస్తున్న నాయకులు

గార్ల: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు రాగం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మద్దివంచ గ్రామంలో సీపీఐ నాయకుల బృందం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, సత్యనారాయణ, భిక్షమయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పంట నష్టంపై వ్యవసాయ అధికారుల సర్వే

కురవి: సీరోలు మండలంలోని కొర్లకుంట తండా గ్రామంతోపాటు పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలపై మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి చాయారాజ్ సర్వే నిర్వహించారు. మిర్చి పంట 200 వందల ఎకరాలు, వరి పంట 1200, పత్తి పంట 390 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు.

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వాహిని మంగళవారం నీట మునిగిన వరి, పత్తి పంటలను పరిశీలించారు.

నష్టపరిహారం చెల్లించాలి

గార్ల: భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు, మాన్యా నాయక్, వీరభద్రం, సీహెచ్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

నెల్లికుదురు: సర్వం కోల్పోయిన వరద బాధితులకు తక్షణ పరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు మధన్ అన్నారు. మండలంలోని రావిరాల గ్రామంలో మంగళవారం పర్యటించి వరద బాధితులను పరామర్శించారు.

క్లుప్తంగా

డోర్నకల్‌లో సీఎం..



డోర్నకల్: ఖమ్మం జిల్లా నుంచి మంగళవారం డోర్నకల్ మీదగా పురుషోత్తమయగూడెం వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ ఆగుతారని ప్రచారం జరగడంతో ప్రజలు పెద్ద ఎత్తున బైపాస్ రోడ్డుకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12.10గంటలకు సీఎం కాన్వాయ్ బైపాస్ రోడ్డుకు చేరుకోగా నాయకులు, కార్యకర్తలు సీఎం వాహనం వెంట పరుగులు పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కదులుతున్న వాహనం నుంచే చేతులు ఊపుతూ వినతిపత్రాలు స్వీకరించారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుండ్లకుంట కాలనీతోపాటు పలు కాలనీల్లో సీపీఎం బృందం మంగళవారం పర్యటించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీతారాంనాయక్, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, రాజు, చీపిరి యాకయ్య, నాగన్న, భాగ్యమ్మ, తోట శ్రీను పాల్గొన్నారు.

చెరువు కట్టకు బుంగ



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజీ)లోని బూర్లవాని పెద్ద చెరువు కట్టకు మంగళవారం బుంగపడింది. చెరువు కట్టకు ఆనుకుని డోర్నకల్–మహబూబాబాద్ రైల్వే లైన్ ఉంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద చెరువు అలుగు పోసింది. మత్స్యకారులు బుంగను గమనించి రాళ్లను అడ్డుపెడుతున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే బుంగ పెద్దగా మారితే కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు కట్టకు ఏర్పడిన బుంగను పూడ్చే యత్నాలు చేయాలని రైతులు, మత్స్యకారులు కోరుతున్నారు.

వేం నరేందర్‌రెడ్డికి వినతి



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ సీఎం ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ విన్నవించారు. మంగళవారం గార్ల మండల సమీపంలోని గంగారం తండాకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వచ్చిన వేం నరేందర్‌రెడ్డికి పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి ఆవశ్యకతను ఆయన వివరించారు.

విరాళం



తొర్రూరు: అకాల వర్షాలతో సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం స్థానిక మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు రూ.5 వేల సాయాన్ని మంగళవారం డివిజన్ కేంద్రంలో తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సిరికొండ విక్రమ్‌కుమార్, ప్రతినిధులు మర్సకట్ల అనిల్‌కుమార్, సాయినాథాచారి, వెంకట్‌రెడ్డి, మహేందర్, రాజేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

బెంచ్‌ప్రెస్‌లో గోల్డ్ మెడల్



డోర్నకల్: మేడ్చల్ జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో డోర్నకల్‌కు చెందిన ఎస్‌కె హమీద్‌పాషా 74కేజీల విభాగంలో పాల్గొని 107.5 కేజీల బరువును బెంచ్‌ప్రెస్ చేసి బంగారు పతకం సాధించాడు. అక్టోబర్ 14న గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తా..



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కేటీఆర్ కాలనీని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మంగళవారం సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను కాలనీ ప్రజలకు అందేలా కృషి చేస్తానని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు వివరిస్తామని తీన్మార్ మల్లన్న తెలిపారు. అనంతరం కాలనీవాసులకు టీ షర్టులను పంపిణీ చేశారు.

ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలి

● మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రావిరాల గ్రామానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని గ్రామస్తులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. గ్రామాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించకపోవడంతో గ్రామస్తులు నిరాశ చెందారని, ఈనెల 2న మంత్రి సీతక్క గ్రామాన్ని సందర్శించి ధైర్యం చెప్పారే తప్పా ఎలాంటి హామీలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లికుదురు మండలంలో పలు చెరువుల కట్టలు తెగి రైతులు నష్టపోయారన్నారు. రైతులకు ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పురుషోత్తమాయగూడెం వాగులో పడి మృతి చెందిన కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో రాకేశ్‌రెడ్డి, ఫరీద్, రాజు, అశోక్, యాకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఏటి వద్ద ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. వరద బాధితులను పరామర్శించేందుకు జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తెలియజేసేందుకే ధర్నా నిర్వహించినట్లు వెల్లడించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు మంత్రులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య సీఎం దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్ద వెంకటేశ్వర్లు, వీరస్వామి, రామకృష్ణ, మహేశ్వరరావు, వీరభద్రం, అశోక్, నాగేశ్వరరావు, కోటయ్య, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్లు, చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎంపీ

చిన్నగూడూరు: మండలంలో కొట్టుకుపోయిన రోడ్లు, తెగిపోయిన చెరువులను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి పరిశీలించారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆకేరువాగు ఉధృతికి చిన్నగూడూరు ఆకేరువాగు బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. అనంతరం జయ్యారంలోని తెగిపోయిన రామసముద్రం చెరువు కట్టను, గండి పడిన పెద్ద చెరువును పరిశీలించి, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నగూడూరు– గుండంరాజుపల్లి మధ్య ఉన్న జిన్నెలవాగు ఉధృతిని పరిశీలించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి, గునిగంటి కమలాకర్, సూదగాని నగేష్, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీఓ రామారావు, ఎస్సై ఝాన్సీ తదితరులు ఉన్నారు.

నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం

నెల్లికుదురు: భారీ వర్షాల కారణంగా చెరువులు కుంటలు తెగిపోయి వరదలతో పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని రాజుల కొత్తపల్లి, సీతారాపురంలో తెగిపోయిన ఉమ్మడి చెరువు, ఆలేరు ఊర చెరువులను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పర్యటించి ఆదుకుంటామని రైతులకు ధైర్యం చెప్పారు.



కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్

బ్రిడ్జిపై చెత్తాచెదారం తొలగింపు



దంతాలపల్లి: బ్రిడ్జిపై చెత్తను తొలగిస్తున్న జేసీబీ

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామ శివారు పాలేరు వాగు బ్రిడ్జిపై వరదలకు పేరుకుపోయిన చెత్తను కాంగ్రెస్ నాయకుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీ సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొడిపిగంటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు

పెద్దవంగర: తొర్రూరు–వలిగొండ ప్రధాన రహదారి చిన్నవంగర సమీపంలోని కిష్టుతండా వద్ద ప్రధాన రహదారిపై నూతన బిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో కురిసిన వర్షానికి మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. మంగళవారం మట్టి రోడ్డును పునర్నిర్మాణ పనులు చేసినట్లు ఈఏ రామ్‌రాజ్ తెలిపారు.

వైద్యశిబిరం

తొర్రూరు రూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. లక్ష్మినర్సింహ ఆస్పత్రి హనుమకొండ వారి సహకారంతో గ్రామంలోని అన్నివర్గాల ప్రజలకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మద్దెల రమా, శోభరాణి, వైద్య సిబ్బంది సుభాష్, కృష్ణవేణి, పాషా, కారోబార్ సంతోష్ పాల్గొన్నారు.

తొర్రూరు: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని 6వ వార్డులో మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కమిషనర్ శాంతికుమార్, వైద్యులు మహేష్, సిబ్బంది శ్రీనివాస్, సూపర్‌వైజర్ జయమణి, ఏఎన్ఎం అనురాధ పాల్గొన్నారు.

గర్భిణి అదృశ్యం



గూడూరు: ఇంట్లో పడుకున్న ఓ గర్భిణి సోమవారం రాత్రి 11.30గంటలకు బయటికి వెళ్లి కనిపించకుండాపోయిన సంఘటన మండలంలోని భూపతిపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. భైరి మమతకు అదే గ్రామానికి చెందిన ఎల్లస్వామితో 10 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. ఈక్రమంలో మమత గర్భం దాల్చి 9నెలలు అవుతుంది. ఆస్పత్రిలో చూపించుకోగా వైద్యుడు మరో 4నాలుగు రోజుల్లో ప్రసవ తేదీ ఇచ్చారు. తల్లిగారింటి వద్ద ఉన్న మమత సోమవారం రాత్రి 11.30కు నిద్ర లేచింది. బాత్రూంకు వెళ్తుందని తల్లి అనుకుంది. కొద్ది సేపటి తరువాత నిద్ర మేల్కొన్న తల్లి పిలుస్తూ బయటికి వెళ్లి చూడగా మమత కనిపించ లేదు. వెంటనే అదే గ్రామంలో ఉన్న అల్లుడికి సమాచారం అందించింది. తెల్లవారు జామున బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త ఎల్లస్వామి సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94901 17493 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు

డోర్నకల్: మూడు రోజులుగా రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలతో చెరువుల నుంచి వరద పోటెత్తడంతో తాళ్లపూసపల్లి–కేసముద్రం, ఇంటికన్నె–కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిన విషయం విధితమే. దీంతో మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, కొత్తగూడెం మార్గంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోర్నకల్ నుంచి ప్రతి రోజూ ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, విజయవాడలో ఉద్యోగులు, వ్యాపారాలు చేసేవారు, చిరు వ్యాపారులు, కూలీలు ఉపాధి కోల్పోతున్నారు. కాగా ఖమ్మం, మహబూబాబాద్ మధ్య నడిచే ఆర్టీసీ బస్సులను డోర్నకల్ మీదుగా నడుపుతున్నారు.



డోర్నకల్ మీదుగా నడుస్తున్న కురవి ఆర్టీసీ బస్సు

ఇబ్బంది పడుతున్నా..



ఎలక్ట్రిషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. నాకు సీజన్ పాస్ ఉంది. ప్రతీరోజు గోల్కొండకు వరంగల్ వెళ్లి మెటీరియల్ తెచ్చుకుంటా. రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో నేను వరంగల్‌కు వెళ్లడం బంద్ అయింది. దీంతో పనులు ఆగిపోయాయి. - కృష్ణదాసన్, ఎలక్ట్రిషియన్, కేసముద్రం

రైళ్లను పునరుద్ధరించాలి..



ప్రతిరోజూ రైలులో విజయవాడ వెళ్తూ చిన్న వ్యాపారం చేస్తున్న. తరచూ రైళ్లు రద్దవుతుండటంతో నాతో పాటు చిరుద్యోగులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలి.

- కర్లపాటి రాజు, డోర్నకల్

వరద బాధితులకు దాతల చేయూత

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని పురుషోత్తమాయగూడెం శివారు సీతారాంతండాలో వర్ష బీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితులకు ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్, శ్రీవాసవీ దేవాలయ కమిటీ, అష్టలక్ష్మి దేవాలయ కమిటీ, వాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గర్రెపల్లి వెంకటేశ్వర్లు, ఇమ్మడి రవికుమార్, కనుమర్లపూడి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శ్రీరామ్ ప్రసాద్, విజయ్ గుప్తా, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

కురవి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోద్గులగూడెం గ్రామానికి చెందిన పలువురు వరద బాధితులకు ప్రభుత్వం ద్వారా బియ్యంను మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, ఎంపీడీఓ వీరబాబులు అందించారు.



మహబూబాబాద్ రూరల్: నిత్యావసరాలను అందజేస్తున్న ఆర్య వైశ్యులు

కేసముద్రం: మండలంలోని ధర్మారంతండాజీపీ శివారు సీతారాంతండాకు చెందిన శ్రీనివాస్, మంగీలాల్ ఇళ్లు ఆదివారం కురిసిన భారీ వర్షంతో నీట మునిగి, సామగ్రి కొట్టుకుపోయింది. ఈమేరకు స్పందించిన ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాలకు మంగళవారం నిత్యావసర వస్తువులను అందజేశారు.



కేసముద్రం: ధర్మారంతండాలో బియ్యం అందజేస్తున్న దాతలు

కేసముద్రం మండల కేంద్రంలో సంతోష్‌నగర్ కాలనీ, రామమందిరం, హైస్కూల్ రోడ్డుకు చెందిన 150 కుటుంబాలకుగాను, దాతల సహకారంతో 17క్వింటాళ్ల బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, దయాకర్, వోలం రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వరదనీటిలో పడిన మహిళ మృతి

కేసముద్రం: వరదనీటిలో పడిన ఓ మహిళ అస్వస్థతకు గురై మంగళవారం మృతిచెందిన సంఘటన కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్‌కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన బాదావత్ వాణి(55) అనే మహిళ, ఆదివారం కురిసిన భారీ వర్షం కారణంగా వచ్చిన వరదనీటిలో ప్రమాదవశాత్తు పడింది. దీంతో కొంతదూరం కొట్టుకుపోగా ఆమెను కుటుంబ సభ్యులు బయటకు తీసుకువచ్చారు. ఈమేరకు అస్వస్థతకు గురైన ఆమెకు స్థానిక వైద్యులు వైద్యం చేయించారు. ఈక్రమంలో పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త జయరాం, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

తొర్రూరు రూరల్: డివిజన్ కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీడీఓ వేణుమాధవ్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలలో షార్ట్ సర్క్యూట్ అయిందని, విద్యార్థులకు ప్రమాదం జరిగిందని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలతో స్పందించి పాఠశాలను సందర్శించారు. షార్ట్‌సర్క్యూట్ కాలేదని, విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎంపీడీఓ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో ఆగస్టు 26వ తేదీన కారు, ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముత్యాల విజయ్ (28) మృతి చెందాడని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడి సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

పాఠశాలలో చొరబడిన దొంగలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. హెచ్ఎం పూజారి వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులపూసపల్లి పాఠశాలలోని ఉపాధ్యాయుల గది, వంటగది, స్టాఫ్ గదిలోని బీరువాల తలుపుల తాళాలు పగలగొట్టి ఉన్నాయని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. పాఠశాలకు వచ్చి పరిశీలించగా రికార్డులు, ఉపాధ్యాయుల సర్వీసు పుస్తకాలు చిందరవందరగా ఉన్నాయన్నారు. పాఠశాలకు ప్రహరీ గేటు లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని హెచ్ఎం తెలిపారు. జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్తామని, రూరల్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు.

నాయకులపై దాడులు సరికాదు

బయ్యారం: వరద ముంపునకు గురైన బాధితులను ఖమ్మంలో పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులతోపాటు బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయటం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేశ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

దంతాలపల్లి: భారీవర్షాలకు నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డీటీ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్న, పాడిశెట్టి లింగన్న, నరేష్, యాకుబ్‌రెడ్డి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వస్తున్నారని..
మురుగు నీరు తొలగింపు

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ కొంతకాలంగా పని చేయడం లేదు. దీంతో ఫౌంటెయిన్ మధ్యలో వర్షపు నీరు చేరి దోమలు, ఈగలతో దుర్గంధం వెదజల్లుతోంది. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం నుంచి డోర్నకల్ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పురుషోత్తమాయగూడెంకు వెళ్తుండటంతో మున్సిపల్ సిబ్బంది ఫౌంటెయిన్‌లోని మురుగు తొలగించారు.

సీఎంకు వినతి

మహబూబాబాద్: జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో జరిగిన నష్టానికి రూ.15కోట్లు విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఇనుప జాలీలను తొలగించాలని అధికారులకు వినతి

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో చెరువులో పెట్టిన ఇనుప జాలీని తొలగించాలని డీటీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ వివేక్‌రామ్‌కు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ఏనకుంట చెరువులో చేపలు పోకుండా ముదిరాజ్‌లు పిల్లర్లు పోసి ఇనుప జాలీ వేశారన్నారు. జాలీ వేయడం వలన నీళ్లలో వచ్చే చెత్త జాలికి తట్టుకుంటుందన్నారు. దీంతో కట్ట తెగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో చిన్న రాములు, బీకోజి, సోమయ్య, బింగి రామనాదం, ఎల్లయ్య, వెంకటయ్య, గొరయ్య పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని బంధం చెరువు మత్తడికి ముదిరాజ్‌లు ఇరువైపుల ఇనుప జాలీలను తొలగించాలని రైతులు డీటీ సంజీవకు వినతిపత్రం అందజేశారు.